# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్ శనివారం 4 జనవరి 2025 | ADILABAD NIRMAL


## మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, జనవరి 3 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులను నిర్మల్ డీఈవో రామారావు ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం, విద్యార్థుల ప్రగతి, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సోన్, జనవరి 3 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని శుక్రవారం నిర్మల్ జిల్లా జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసంలోని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి, మాజీ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, జనవరి 3 : జిల్లాలో గతేడాది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది విజయవంతంగా విధులు నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పోలీసు క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసులు, సిబ్బందితో కలిసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసులందరూ జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గతేడాది విజయవంతంగా విధులు నిర్వహించడంపై జిల్లా పోలీసు యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎల్లవేళలా జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద, సీఐలు, ఎస్ఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, ఎన్ఐబీ, డీసీఆర్బీ, ఐటీ కోర్, పోలీసు ముఖ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**'ఇంటర్ సెప్టర్'తో ఆకతాయిల ఆగడాలకు చెక్**

ఆకతాయిలు, నేరస్తుల ఆగడాలను నివారించడంతో పాటు అలర్లు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకునేందుకు పోలీస్ సిబ్బందికి 'ఇంటర్ సెప్టర్' వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నూతన ఇంటర్ సెప్టర్ వాహనాన్ని జెండా ఊపి పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జరిగే నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆరుగురు సిబ్బందితో ప్రత్యేక ఇంటర్ సెప్టర్ వాహనాన్ని ఉపయోగించనున్నట్లు తెలిపా రు. ఎక్కువగా ప్రమాదాలు, అల్లర్లు, నేరాలు జరిగే హాట్ స్పాట్‌ల వద్ద గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. ప్రాణ నష్టం నివారణకు సిబ్బంది తక్షణమే చర్యలు తీసుకుంటారని తెలిపారు. మహిళలు, యువతులు, విద్యార్థునులపై ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించే ప్రదేశాలు, జాతరలు, సమావేశాలు, సభలు, ప్రజలు గుమిగూడి ఉండే ప్రాంతాల్లో రక్షణ కల్పించనున్నట్లు వివరించారు. అత్యవసర సమయాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సందర్భాల్లో అల్లరి మూకలపై అత్యవసరంగా స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్, కరుణాకర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, మురళి, చంద్రశేఖర్, ఇంటర్ సెప్టర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అధికారులతో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

# వేతనాలు పెంచి న్యాయం చేయండి

**ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు**

బాసర, జనవరి 3 : 'మాకు వేతనాలు పెంచి న్యాయం చేయండి' అంటూ శుక్రవారం ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ విధానంలో ట్రిపుల్‌ఐటీలో సేవలందిస్తున్నామని తెలిపారు. చాలీచాలని జీతంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇటీవల తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద జరిగిన మహా ధర్నా చేపట్టగా సమస్యలు పరిష్కరిస్తామని చైర్మన్ బాలకృష్టా రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కారు స్పందించి యూజీసీ 7వ పే స్కేల్ ప్రకారం బేసిక్, డీఏ హెచ్‌ఆర్ఏ, 3 శాతంతో కూడిన వార్షిక పెరుగుదలను అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. తమను రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ 77 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.



వేతనాలు పెంచాలంటూ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్లు ప్రొఫెసర్లు

# ఆదర్శనీయురాలు సావిత్రీబాయి

- హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- ఘనంగా జయంతి వేడుకలు

ఎదులాపురం, జనవరి 3: నేటి మహిళలకు సావిత్రీబాయి పూలే స్ఫూర్తిదాయకమని రాష్ట్ర హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి రిటైర్డ్ జడ్జితో పాటు కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో స్త్రీ విద్య కోసం సావిత్రీబాయి చేసిన కృషి చిరస్మరణీయంగా నిలిచి పోతుందని పేర్కొన్నారు. స్త్రీ విద్యకు నాంది పలికి సమ సమాజ నిర్మాణానికి కృషిచేసిన జ్ఞాన జ్యోతి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో భగత్ సునీత కుమారి, ఆర్డీవో వినోద్ కుమార్, అధికారులు ఉన్నారు.

**పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి**

నిర్మల్ అర్బన్, జనవరి 3 : సావిత్రీ బాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 200 సంవత్సరాల క్రితమే మహిళల విద్య, ఆవశ్యకతను గుర్తించి వారికోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, డీఆర్డీవో విజయ లక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ద పద్మ, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, మహిళా సిబ్బంది తదితరులున్నారు.





ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న హై కోర్ట్ రిటైర్డ్ జడ్జి షమీమ్ అక్తర్, కలెక్టర్ రాజర్షి షా , నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

# మెరుగైన వైద్యమందించేందుకు ప్రత్యేక కృషి

- 30 మంది వైద్యులతో ఉమ్మడి జిల్లా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీం
- టీజీఎంసీ చైర్మన్ డా.ఎగ్గెన శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జనవరి 3 : ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లీగల్, ఎథికల్ అండ్ యాంటీ క్వాకరీస్ కమిటీ మెంబర్ యెగ్గెన శ్రీనివాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పూజారి రమణ అన్నారు. శుక్రవారం పాత మంచిర్యాలలోని ఐఎంఏ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమీషన్ల కోసం ప్రజలపై భారం మోపుతున్న నకిలీ వైద్యులు, వారికి సహకరిస్తున్న హాస్పిటళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి 30 మంది వైద్యులతో కూడిన ఉమ్మడి జిల్లా టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేశామన్నారు. వైద్య వృత్తిపై విలువలు, నమ్మకం పెంచడమే ఈ మెడికల్ టాస్క్ ఫోర్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ.. ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్ వైద్యులపైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. 70 వేల మంది వైద్యుల సహకారంతో, వైద్య వ్యవస్థలో ఉన్న వివిధ సంఘాలైన ఐఎంఏ, తానా, హెఆర్‌డీఏ, ప్రభుత్వ వైద్యులు, టీజీఎంసీ బృందంగా ఏర్పాటవుతామని తెలిపారు. వరంగల్‌లో ఇప్పటికే మెడికల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెడికల్ టాస్క్ ఫోర్స్ టీంలో ప్రజలు, న్యాయవాదులు, పోలీసులు, పత్రికా ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లను భాగస్వాములను చేసుకొని ముందుకెళ్తామన్నారు. అనైతికంగా వైద్యం చేస్తున్న డాక్టర్లు, హాస్పిటళ్లకు ఐఎంఏ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందవని వెల్లడించారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులుంటే తక్షణమే వాట్సాప్ నంబర్ 7557555777లో సమాచారం అందించాలని కోరారు.



జైనథ్ మండలం సాంగ్వి వద్ద పెన్‌గంగ నదిలో ఇసుక ట్రాక్టర్లు

# తోడేస్తున్నారు!

- ఇసుక క్వారీలకు అనుమతి లేకున్నా దందా కొనసాగిస్తున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా తరలుతున్నా అధికారుల చర్యలు సున్నా!

## పెన్‌గంగ నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా

ఆదిలాబాద్, జనవరి 3(నమస్తే తెలంగాణ): పెన్‌గంగ నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. జిల్లాలో ఎక్కడా ఇసుక క్వారీలకు అనుమతి లేకున్నా యథేచ్ఛగా తరలిస్తూ దళారులు, వ్యాపారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయలు గండి కొడుతున్నా సంబంధిత అధికారుల చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహారాష్ట్రతో పాటు జిల్లాలో భారీ వర్షాలతో పెన్‌గంగ ఉధృతంగా ప్రవహించింది. దీంతో నది పరీవాహక ప్రాంతాల్లోని భారీగా ఇసుక మేటలు వేశాయి. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో అక్రమార్కులు అనుమతి లేకుండా ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రాజకీయ నాయకుల అండతో జైనథ్, బేల మండలాల్లో ఇసుక వ్యాపారులు, దళారులు నది పరివాహక గ్రామాల్లోని కొందరు స్థానికులను మచ్చిక చేసుకుని ఇసుక దందా కొనసాగిస్తున్నారు.



ఇసుక తవ్వేందుకు నదిలో నీటి ప్రవాహానికి రాళ్లతో అడ్డుకట్ట నిర్మించిన దళారులు

ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్, బేల, భీంపూర్ మండలాల్లోని పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాల నుంచి రోజు వందలాది ట్రాక్టర్లతో పాటు టిప్పర్లను ఇసుకను తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. జేసీబీల ద్వారా ఇష్టారాజ్యంగా ఇసుకను తోడుతూ ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. జైనథ్ మండలం సాంగ్వి, కౌట, కొరాట, బేల మండలం కాంగర్‌పూర్, సాంగిడి, భీంపూర్ మండలం అంతర్గాం, గుబిడి గ్రామాల పరివాహక ప్రాంతాల నుంచి జోరుగా ఇసుక రవాణా జరుగుతున్నది. ఇండ్లు, భవనాల నిర్మాణాలు ప్రభుత్వ పనులకు సైతం పెన్‌గంగ నుంచి ఇసుక రవాణా జరుగుతున్నది. జిల్లాలో ఎక్కడా ఇసుక క్వారీలకు అనుమతి లేకున్నా దళారులు ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

**రాయల్టీ పేరిట వసూళ్లు**

కొందరు రాజకీయ పార్టీల నాయకుల అండ దండలతో దళారులు ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరిట వేలం పాటలు నిర్వహిస్తూ నిర్వాహకులకు భారీగా చెల్లిస్తున్నారు. మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో వేలం పాటల ద్వారా రూ. 10 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఇసుకను తీసుకుపోవడానికి చెల్లిస్తున్నారు. దళారులు నది ప్రాంతాల్లో రాయల్టీ పేరిట ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 500 వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తుండగా, టిప్పర్ల ద్వారా మహారాష్ట్రకు తీసుకుపోతున్నారు. ఇసుకను తీసుకుపోవడానికి గ్రామాలతో పాటు నది పరివాహక ప్రాంతాలు, రైతుల పంట పొలాల పక్క నుంచి రోడ్లు వేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా రవాణాకు పాల్పడుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నదిలో నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు కట్టలు కడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, జనవరి 3 : పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం పదో తరగతి పరీక్షల ప్రిపరేషన్‌పై సంబంధిత కేజీబీవీ, హైస్కూల్, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, మండల ప్రత్యేకాధికారులకు కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడం, షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలను అనుసరించడం, తదితర అంశాలపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ఉన్నందున విదార్థుల్లో తీవ్ర ఆందోళన, ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వారికి మనో నిబ్బరం కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ఉత్కంఠ, ఉద్వేగాలకు లోను కానివ్వకుండా అవగాహన కల్పిస్తే ఒత్తిడిని అధిగమిస్తారని తెలిపారు. ఇందుకు మండల ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు వచ్చే ఈ రెండు నెలలు చాలా జాగ్రత్తగా ఉండి విద్యార్థుల తగిన గైడెన్స్ అందిస్తూ అవగాహన కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గూగుల్ మీట్‌లో డీఈవో ప్రణీత, కేజీబీవీ కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు అజయ్, బీసీ వెల్ఫేర్ రాజలింగు ఉన్నారు.



భైంసా: నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

## మూడో రోజుకు హమాలీల సమ్మె

భైంసా, జనవరి, 3 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భైంసాలో సివిల్ సప్లయ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీవో అమలు చేయాలని, కార్మికులకు రూ. 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ కార్మికులు పాల్గొన్నారు.

ఖానాపూర్, జనవరి 3: సివిల్ సప్లయ్ గోదాముల్లో పని చేస్తున్న హమాలీల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్‌లోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరుకోగా మద్ద తు తెలిపి ఆయన మాట్లాడారు. పెంచిన రేట్ల జీవోతో పాటు పెండింగ్ బకాయిలు, యూనిఫాం కుట్టు కూలీ రేట్లు, బోనస్, పెంచిన వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసాచారి, నాయకులు భూక్యా రమేశ్, ఎల్ఆర్ ఉపాలి, భీమేశ్, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్: సివిల్ సప్లయ్ గోదాం వద్ద సమ్మెలో పాల్గొన్న హమాలీలు



చలిమంట కాగుతున్న మహిళలు, చిన్నారులు

# చలి@7.1

ఏజెన్సీ ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లాపై చలి పంజా విసరగా, ప్రజానీకం గజగజ వణికిపోతున్నది. మబ్బులు పడి కొన్ని రోజుల పాటు కాస్త చలి తగ్గినా, గత నాలుగైదు రోజుల నుంచి విజృంభిస్తున్నది. సాయంత్రం ఆరింటిలోపే ప్రజలు ఇళ్లకు చేరుకుంటుండగా, రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇక ఉదయం 8 గంటలు దాటినా పొగమంచు తొలగడం లేదు. కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లడ్ లైట్లు వేసుకొని ప్రయాణం సాగిస్తుండగా, మరికొందరు సూర్యుడు ఉదయించిన తర్వాతే ముందుకు సాగుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్(యు)లో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, ఆదిలాబాద్ జిల్లాలోని బేలలో 7.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎక్కడ చూసినా చిన్నా.. పెద్దలంతా చలి మంటలు కాగుతూ కనిపించారు. కాగా, ముందు మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసరమైతేగానీ బయటికి రావద్దని, తెల్లవారు జామున, రాత్రి వేళ బయటికి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. - నమస్తే నెట్‌వర్క్